క్లుప్తంగా

నేడు కాశీ మహా పాదయాత్ర ప్రారంభం

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయం నుంచి శనివారం తెల్లవారు జామున 3.30 గంటలకు కాశీ మహా పాద యాత్ర ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీమద్భగవద్గీత ధర్మ ప్రచార సమితి మాజీ కార్యదర్శి మాడూరు వెంకటశేషయ్య తెలిపారు. ఈ కాశీ మహా పాదయాత్రలో పలు వురు భక్తులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. హిందూ ధర్మ పరిరక్షణ–దేశ రక్షణ, ×ప్రపంచ శాంతి కోసం ఈ పాదయాత్ర చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. 45 రోజులపాటు జరిగే ఈ పాదయాత్రలో అవసరమైన వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మరి కొంతమంది భక్తులు తమతో మార్గమధ్యంలో పాల్గొనేందుకు తమ అంగీకారం తెలియజేశారన్నారు. మరిన్ని వివరాల కోసం 9440223485 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99631 70177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట వేడుకలు

తొండూరు : మండలంలోని బూచుపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ట వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే సీనియర్ ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.లక్ష, రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ. 20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6500 నగదు బహుమతులను అందించనున్నామని తెలిపారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని శెట్టివారిపల్లె సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.2100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న నరేన్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని ఉలవలపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబులేసు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి ఓబులేసు మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సర్పంచ్ శ్రీనువాసులు, ఎంపీటీసీ వెంకటశివారెడ్డి, మండల బూత్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లెలో నల్లనమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీ లు శనివారం రసవత్తరంగా సాగాయి. పోటీల్లో 14 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో రూకవారిపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి, విద్య ఓబుల్‌రెడ్డి(కంబైన్స్) ఎద్దులు మొదటి బహుమతి, తిప్పిరెడ్డిపల్లెకు చెందిన విశ్వనాథరెడ్డి ఎద్దులు రెండవ బహుమతి, ఖాజీపేటకు చెందిన లక్ష్మిరెడ్డి ఎద్దులు మూడవ బహుమతి, నాగయ్యపల్లెకు చెందిన వేమారెడ్డి ఎద్దులు నాలుగవ బహుమతి సాధించాయి.

నిందితులు అరెస్ట్

మైలవరం : మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన పొన్నతోట మనోహర్, ప్రొద్దుటూరుకు చెందిన పొన్నతోట జయరాజ్, ఇల్లూరి నాగరాజు అలియాస్ ఉపేంద్రలను అరెస్ట్ చేశారు. శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ గోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మనోహర్ గత కొంత కాలంగా మద్యం, జల్సాలకు అలవాటు పడి జమ్మలమడుగులోని భాగ్యనగర్‌లో ఒక బైక్, మైలవరం మండలంలో 2 బైక్‌లు, అలాగే సిలిండర్ చోరీకి పాల్పడ్డాడు. అలాగే పొన్నతోట జయరాజ్, ఇల్లూరి నాగరాజు అలియాస్ ఉపేంద్రలు ఇరువురు నడుచుకుంటు పోతున్న వారిని గుర్తించి కాపు వేసి వారి బైక్‌లో కూరో పెట్టుకుని తమ ప్రాంతంలో వదులుతాము అన్ని నమ్మించి గ్రామ వెలుపల వెళ్లిన తరువాత దాడి చేసి వారి దగ్గర ఉన్న నగదును దోచుకుని వెళ్లేవారు. శుక్రవారం వేపరాల గ్రామంలోని పెన్నా బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా పోలీస్‌లను చూసి పారిపోతుండగా పోలీస్‌లు పట్టుకుని విచారించగా అసలు విష యం బయటపడినట్లు సీఐ తెలిపారు.

పప్పుశనగ పంటలను దెబ్బతీస్తున్న తెగుళ్లు

- భారీగా తగ్గిపోయిన శనగ దిగుబడి
- రోజురోజుకు తగ్గుతున్న శనగల ధర
- ఆందోళనలో రైతులు



శనగ పంటను కోత కోస్తున్న కూలీలు

సింహాద్రిపురం : పప్పుశనగ పంటలను తెగుళ్లు దెబ్బతీస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆశించిన దిగుబడులులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు శనగ ధరలు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. ×తమ పరిస్థితి అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి×లా తయారైందని శనగ రైతులు ఆవేదన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా వేలాది ఎకరాలలో పప్పుశనగ పంటను సాగు చేశారు. సకాలంలో సబ్సిడీ శనగ విత్తనాలు అందకపోయినా పదును దాటిపోతుందని బయట మార్కెట్‌లో క్వింటా శనగలు రూ.6,500 చొప్పున కొనుగోలు చేసి పంటను సాగు చేశారు. శనగ పంటలో మంచి దిగుబడులు వస్తాయని ఎన్నో ఆశలతో ఉన్న తరుణంలో అకాల వర్షం ముసురుతో, తెగుళ్లవల్ల శనగ పంట నాశనమయ్యాయి. దీంతో ఎకరాకు 8 బస్తాల నుంచి రూ.10 బస్తాల శనగల వరకు దిగుబడి వస్తుందనుకుంటే. కేవలం 3 క్వింటాళ్లలోపే శనగల దిగుబడి వచ్చింది. కొన్ని గ్రామాల్లో శనగ దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. 15 రోజుల క్రితం క్వింటా శనగల ధర రూ.6,500లు ఉండగా.. ప్రస్తుతం రూ.5,800లు పలుకుతోంది.

శనగల తూకాల్లో మోసం

గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని జీరో వ్యాపారం చేస్తూ వ్యాపారాలు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. వ్యాపారులు విత్తనాల్లో తేమశాతం అంటూ తూకాలలో కేజీలకు కేజీలు దోచేస్తున్నారు. క్వింటాకు ఒక కిలో నుంచి 5 కేజీలు అదనంగా తరుగు తీస్తున్నారు. దీంతో రైతులు పూర్తిగా నష్ట పోతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పంటల సాగుకు పెరిగిన పెట్టుబడులు

ప్రధాన పంటలైన వేరుశనగ, పప్పుశనగ పంటలను సాగుచేయాలంటే ఎకరా పొలం సేద్యానికి విత్తనాలు, మందులు, ఎరువులు, కూలీల ఖర్చులు కలిపి దాదాపు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ ఏడాది దిగుబడి మాత్రం ఎకరాకు 3 క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూలీల ఖర్చులు పెరిగిపోవడంతోపాటు యంత్రాల సహాయం తీసుకున్న వాటి ధరలు పెంచారని, తప్పని పరిస్థితుల్లో తగ్గిన దిగుబడులు, ధరలు తగ్గడంతో వ్యవసాయం భారంగా మారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతులకు ఎప్పుడూ గడ్డు కాలమే



పంటలు పండక పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు అన్నివిధాలా నష్టపోతున్నారు. దీంతో రైతులు గడ్డు పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తోంది. నాకు ఎకరాకు కేవలం రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. భారీగా పెరిగిన పెట్టుబడులతో వ్యవసాయం గిట్టుబాటు కాకుండాపోతోంది. ప్రభుత్వం రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలి.

– కుళ్లాయప్ప,శనగ రైతు, సింహాద్రిపురం

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకు ఉన్న 15 ఎకరాలలో పప్పుశనగ పంట సాగు చేశారు. ప్రస్తుతం శనగ పంటలో కేవలం 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. శనగల ధరలు చూస్తే రోజు రోజుకు పడిపోతున్నాయి. శనగ రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి.

– కరుణాకర్‌రెడ్డి, శనగ రైతు, సింహాద్రిపురం

పొలతలలో తలనీలాల సేకరణకు వేలంపాట

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో తలనీలాల సేకరణకు శుక్రవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఒక సంవత్సరం తల నీలాలు సేకరణకు ఒంగోలు జిల్లా అద్దంకి పట్టణమునకు చెందిన సుబ్బరాయుడు రూ.51,25,000 లక్షలకు వేలం పాట దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ



కమలాపురం : స్థానిక శ్రీ మత్కన్య కాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే చైతన్య రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. శుక్రవారం అత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు వచ్చిన ఎమ్మెల్యే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

బడ్జెట్ అంచనాలకు ఆమోదం



మున్సిపల్ బడ్జెట్ అంచనాలను ఆమోదిస్తున్న చైర్మన్ మార్పురి మేరి

కమలాపురం : మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ అంచనాలను మున్సిపల్ చైర్ పర్సన్ మార్పురి మేరి ఆమోదించారు. స్థానిక 2వ వార్డు సచివాలయంలో శుక్రవారం కమలాపురం మున్సిపల్ సవరించిన బడ్జెట్(2024–25)అంచనాలు, 2025–26 బడ్జెట్ అంచనాలను కార్యాలయ సిబ్బంది చదివి వినిపించగా, కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ మాట్లాడుతూ పన్ను వసూళ్లలో గతంలో చివరి స్థానంలో ఉన్న కమలాపురం నగర పంచాయతీ కౌన్సిలర్ల సహకారంతో 6వ స్థానంలో ఉన్నామని, ఇది సంతోషించదగ్గ విషయం అన్నారు. కమలాపురం మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

చెత్త సేకరణకు వాహనాలు రావడం లేదు

బీడి కాలనీ, సొసైటీ కాలనీ, అప్పాయపల్లెలోని కాలనీలకు వారంలో ఒక రోజు కూడా చెత్త సేకరణకు వాహనాలు రావడంలేదని, దీంతో చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ఇందిరమ్మ కాలనీ, తదితర కాలనీల్లో వీధి దీపాలు వెలగడంలేదనే అంశాలను కౌన్సిలర్లు బాబుల్, రఫీ సమావేశంలో చర్చకు లేవనెత్తారు. ఇలా ఉంటే స్వచ్ఛభారత్ ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. దీనికి స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో చెత్త సేకరణ రిక్షాలకు రూ.3 లక్షలు కేటాయించామని, అవి రాగానే ప్రతి ఇంటికి డే బై డే వెళ్లి చెత్త సేకరణ చేస్తామన్నారు. నగర పంచాయతీలో కోతులు, కుక్కలు, పందుల సంచారం ఎక్కువైందన్నారు. కుక్కలు మరింత ముందు కొచ్చి వాహన చోదకులను వెంట పడి కరుస్తున్నాయని కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకు రాగా పందుల యజమానులతో మాట్లాడుతున్నామని, కోతులు, కుక్కలను త్వరలో పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని కమిషనర్ సమాధాన మిచ్చారు. వైస్ చైర్మన్ మహ్మద్ సాదిక్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చింతకొమ్మదిన్నె : పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. ఆజాద్‌నగర్‌లోని చాడేశ్వరినగర్‌లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటిలోని నీటితొట్లు, పూల కుండీలు, కూలర్లు, వాడేసిన కొబ్బరి బోండాలలో నీరు నిల్వ ఉన్నట్లయితే అందులో లార్వాలు పెరిగి దోమలుగా మారి కుట్టడం ద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాఘవేంద్ర, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, సమాజ ఆరోగ్య అధికారి సుకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుడ్డశనగ పంటకోత ప్రయోగం

పెండ్లిమర్రి : రబీలో వర్షాధారం కింద సాగు చేసిన బుడ్డశనగ పంట కోత ప్రయోగం శుక్రవారం చెన్నంరాజుపల్లె, కోనాయపల్లె గ్రామ పొలాల్లో నిర్వహించారు. పంటకోత ప్రయోగాన్ని వ్యవసాయాధికారి ఓబులేసు తనిఖీ చేశారు. పంట 5 గీ5 మీటర్లు చూట్టు కొలతలలో కీలో 1.520, 1.680 గ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. వాటి వివరాలను ఇన్సూరెన్స్ కంపెనికి నివేదిస్తామన్నారు. వాటి ఆదారంగానే రైతులకు పంటల బీమా వర్తిసుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ చిట్టి, రైతులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ అమ్మకాలను అడ్డుకోండి



చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

లింగాల : మండలంలోని మురారిచింతల గ్రామంలో ఉన్న చెరువులోని మట్టిని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అక్రమంగా పొరుగు గ్రామాల రైతులకు అమ్ముకుంటున్నారని, దీన్ని అడ్డుకోవాలని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నాగయ్య, మరికొంతమంది రైతులు శనివారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. చెరువుకు సంబంధించిన భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని, చెరువులో ఉన్న భూమి గ్రామ ప్రజలందరికి చెందుతుందని, కేవలం టీడీపీ నాయకులే అక్రమంగా చెరువులను తవ్వుకోవడం, అమ్ముకోవడం నిరోధించాలని వారు తెలిపారు. పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా, లేదా ప్రభుత్వానికి వచ్చే విధంగా ధరను నిర్ణయించి కేవలం మురారిచింతల గ్రామ రైతులకు మాత్రమే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రంలో కోరారు. అయితే టీడీపీ నాయకులు జేసీబీలు పెట్టి ట్రాక్టర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, వారిని అడ్డుకోమని వినతిపత్రం ఇచ్చినా రెవెన్యూ అధికారులు కానీ, పోలీసులు కానీ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని గ్రామంలోని చెరువు గ్రామ ప్రజలందరికి చెందినదని, మట్టిని కూడా గ్రామ ప్రజలే వినియోగించుకునేలా, పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

తాగునీటికి కటకట

ముద్దనూరు : ముద్దనూరులో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మండల వాసులకు తాగునీరందించే సీపీడబ్ల్యూ పథకం సక్రమంగా పనిచేయకపోవడంతో తాగునీటికి కటకట ఏర్పడుతోంది. సుమారు 10 వేల జనాభా కలిగిన ముద్దనూరు పంచాయతీ పరిధిలో 10 తాగునీటి మోటరు బోర్లు అందుబాటులో వున్నాయి. అయితే గండికోట జలాశయం నుంచి తాగునీరందించే సీపీడబ్ల్యూ పథకం అరకొరగా నీటిసరఫరా చేస్తుండటంతో స్థానిక మండల కేంద్రంలోని ప్రజలు తాగునీటి సమస్యను చవిచూస్తున్నారు. 5 రోజుల వ్యవధిలో పంచాయతీ పరిధిలో ఏకంగా 5 బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ముద్దనూరు వాసులకు తాగునీటి కొరత ఏర్పడింది. వేసవి రాకముందే మోటర్లు మరమ్మతులకు గురవుతుండటం, సీపీడబ్ల్యూఎస్ నుంచి నీటి సరఫరా పూర్తి స్థాయిలో లేకపోవడంతోనే ఈ సమస్య ఎదురైనట్లు తెలుస్తోంది. గండికోట జలాశయం నుంచి సీపీడబ్ల్యూఎస్ ద్వారా సరఫరా అయ్యే నీరు సక్రమంగా సాగకపోతే మండల వ్యాప్తంగా తాగునీటి కొరత ఏర్పడే అవకాశం వుంది. తాగునీటి సరఫరా అధికారులు ముందు జాగ్రత్త చర్యలుచేపట్టి తాగునీటి కొరత లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి ఆలయ మహోత్సవాలు

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామం దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ కల్యాణ సమేత శ్రీ ఆంజనేయస్వామి ఆలయ, ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన గోపూజ, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, 2వ తేదీన ప్రాతఃకాల పూజలు, యంత్రములకు మహాన్యాస పూర్వక ఏకాదశ, రుద్రాభిషేకం, జపములు, హోమములు నిర్వహించనున్నారు. 3న యంత్రములకు అభిషేకములు, ప్రతిష్టా హోమం నిర్వహించనున్నారు. ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.10 లక్షలు మంజూరు

కోగటం దళితవాడలో నూతనంగా నిర్మించిన ఈ ఆలయాలనికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవ చూపి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. తర్వాత గ్రామ ప్రజలు, దాతలు విరాళాలుగా వేసుకుని రూ.60 లక్షలకు పైగా వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుంది.

ప్రారంభమైన ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు

వల్లూరు : మండలంలోని గొల్లఓబాయపల్లెలో వెలసిన కోదండ రామాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో గోపూజతో కలశ స్థాపనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణలతో ధ్వజ స్తంభానికి పంచామృత అభిషేకాలతో అభిషేకించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం నిర్వహించారు.

హజ్ హౌస్ ముసుగులో మైనార్టీలపై కపట ప్రేమ

వల్లూరు (చెన్నూరు) : ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ కమలాపురం ఎమ్మెల్యే పుత్ర కృష్ణచైతన్యరెడ్డి హజ్‌హౌస్ గురించి, మైనార్టీల గురించి పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. ఎన్నికల్లో మైనారీల ఓట్ల కోసం హడావిడిగా చెరువులో హజ్ హౌస్‌ను నిర్మించారన్నారు. అయితే వాన పడితే మోకాళ్ళలోతు నీళ్ల నిలువ ఉండే చోట హజ్ హౌస్‌ను కట్టడం వలన ఎందుకు పనికిరాకుండా పోయిందన్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ ఉన్నచోట మాత్రమే హజ్ హౌస్ కడతారని ఈవిషయం మీకు తెలియదా అంటూ వైఎస్సార్‌సీపీ కమలాపురం మైనార్టీ కన్వీనర్ అన్వర్ బాషా ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీ పక్షపాతి కాబట్టి వక్ఫ్ బిల్లును వ్యతిరేకించారు. వక్ఫ్ బిల్లుకు మీ టీడీపీ పార్టీ మద్దతు తెలపడంతో బిల్లుకు ఆమోదం పొందింది. షరీఫ్ మీకు నిజంగా మైనారిటీలపై ప్రేమ ఉంటే మైనార్టీలకు తీవ్ర నష్టం కలిగించే వక్ఫ్ బిల్లు గురించి మీడియా ముందుకు వచ్చి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడండి చూద్దాం. హజ్‌హౌస్‌ను అమలు చేయవచ్చు కదా. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రబ్బు, సాదిక్, జుమన్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు .. శుక్రవారం ఎర్రగుంట్ల మండలం తిప్పలూరుకు చెందిన నవీన్‌రెడ్డి, హేమలత దంపతులతో పాటు లక్ష్మీకుమారి బైక్‌లో కడపకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలోని గొల్లపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేందుకు ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొన్నారు. ఈ ఘటనలో హేమలతకు తీవ్ర గాయం కాగా మిలిగిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు.

అతివేగం ప్రమాదకరం



మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల టౌన్ : వాహనాలలో ప్రయాణించేటప్పుడు అతివేగం ప్రమాదకరమని, వేగ పరిమితులు పాటించాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంవీఐ బీవీ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ హాజీవలిలు హాజరై మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ శ్రీనిత, శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ముద్దనూరు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు నియమాలకు సంబంధించిన పోస్టర్లను గోడలకు అతికించి డ్రైవర్లకు, సిబ్బందికి రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు. అతివేగం చాలా ప్రమాదకరమన్నారు. హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. ఆర్టీసీ డీఎం రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ హాజీవలి, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

వేంపల్లె : ఉత్తమ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు.

ప్రొద్దుటూరుకు చెందిన మేడా వెంకట వీరబ్రహ్మం మానవత సంస్థకు బాడీ ఫ్రీజర్‌ను శుక్రవారం విరాళంగా అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా మానవత ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అడిగిన వెంటనే స్పందించి దాత వీరబ్రహ్మం తన మేనమామ కె.నరసింహులు జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్‌ను అందజేశారన్నారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొని, సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సహాయ చైర్మన్ కావలి కృష్ణతేజ, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, ఉపాధ్యక్షుడు యోగేశ్వరబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : మండలంలోని బీసీ, కాపు, (కాపు, బలిజ, ఒంటరి, తెలగ) రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్య వైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గములకు చెందిన వారు బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఓబీఎంఎంఎస్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన దరఖాస్తు దారులకు మార్చి 9వ తేదీ లోపు వారి బ్యాంకు ఖాతాలో సబ్సిడీ నగదును జమ చేస్తామన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చక్రాయపేట : మండలంలోని బీసీ, కాపు ఈబీసీ తెగలకు చెందినవారు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

వల్లూరు : మండలంలోని బీసీ, కాపు, రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గములకు చెందిన వారు బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు.

ముందుగా గుర్తించటంతో క్యాన్సర్ నివారణకు పరిష్కారం

వేంపల్లె : ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారణకు పరిష్కార మార్గమని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతిసాయి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణకు పరిష్కారం అనే అంశం మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరై ఆమె మాట్లాడుతూ మారుతున్న సమాజంలో సరైన శారీరక శ్రమ లేకపోవడం, ప్లాస్టిక్‌తో కూడిన వస్తువులు అధికంగా వినియోగించడం, డిస్పోజల్ వంటి వాటిని అధికంగా వాడటం , రసాయన ఎరువులను విరివిగా వినియోగించడం , సర్వైకల్ క్యాన్సర్ యొక్క లక్షణాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్క్రీనింగ్ పద్ధతులు, తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తించుట తదితర విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



పులివెందుల : వేడుకలలో ఆర్యవైశ్య సభ్యులు



వేంపల్లెలో కలశాలతో మహిళలు



వల్లూరులో ..



జమ్మలమడుగులో ..

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. అనంతరం వాసవీ మాత ఆత్మార్పణ హోమ గుండం ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ మేడం దినేష్‌కుమార్, వాసవి క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ దిండుకుర్తి నాగభూషణం ,జోనల్ చైర్ పర్సన్ సగళా మహేంద్రబాబు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ రొట్టెల వినోద్‌కుమార్, వాసవీ క్లబ్ సెక్రటరీ మిట్ట మహేశ్వర్ గుప్త, క్లబ్ ట్రెజరర్ మెంటా హరికిషన్, వనిత క్లబ్ అధ్యక్షురాలు మేడ రత్నాలు, సెక్రెటరీ మేడ సునంద, ట్రెజరర్ జూటూరు సుమలత, వనిత క్లబ్ సభ్యులు, వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద మంత్రోచ్చరణతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు రాయవరం సురేంద్ర దంపతులు చండీహోమం నిర్వహించారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానికంగా వెలసిన శ్రీ ఆర్యవైశ్య అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కన్నెలు పవిత్ర జలాలతో నిండిన కళశాల చేతపట్టుకుని అమ్మవారిశాల వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆ జలాలతో వాసవీ మాతకు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి గుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు 102 కలశాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.